# బ్యూక్ కారు - బొచ్చు కుక్క

ఈదురుగాలి వీస్తోంది. ఇప్పుడో, మరు క్షణమో అన్నట్లు గర్జిస్తున్నాయి మేఘాలు. చీకటి జడల దయ్యంలా విరబోసుకుంది.

'ఠంగ్, ఠంగ్...' గడియారం రెండు గంటలు కొట్టింది.

శాంతి కళ్ళలోంచి నీటిబొట్లు రాలేయి.

బాల్కనీలోంచి తొంగి చూసింది. చీకటే కానవచ్చింది. క్రింది కారిడార్‌లో బొచ్చుకుక్క బొంయ్ మంది.

శేఖరం యింకా యింటికి రాలేదు. రాడు కూడా. పట్టికెళ్ళిన డబ్బు అయిపోయినా యింటికి రాడు. ఆ ఆట మోజు అలాంటిది.

'జీవితంలో బ్యాంక్ బాలెన్సూ, బొచ్చు కుక్కా, బ్యూక్‌కారూ ఇవన్నీ మనసిచ్చే మనిషికన్నా గొప్పవా శాంతీ?' ఆనాడు రవికాంత్ అన్న మాటలు యింకా చెవుల్లో గింగురు మంటున్నాయి. శాంతి మనస్సు గతంలోకి ప్రయాణించింది.

---

ద్వితీయ బహుమతి రూ. 25

సోమంచి రమాదేవి

థర్డ్ బి. ఎ., పి. ఆర్. గవర్నమెంట్ కాలేజీ, కాకినాడ

అనంతరామయ్యగారు కాకినాడలో పెద్ద క్రిమినల్ లాయరు. ఆయన ఎటువంటివాడైనా సరే ఫీజు నాలుగంకెల సంఖ్యకు తక్కువ పుచ్చుకునేవాడు కాడు. శాంతి ఆయన ఏకైక పుత్రిక.

శాంతి చిన్నతనంలోనే అనంతరామయ్యగారు తన చనిపోయిన స్నేహితుని కుమారుడు రవికాంత్‌ను తెచ్చి పెద్ద చేశాడు. ఇద్దరూ కలిసి తిరిగారు. ఆడుకున్నారు. చదువుకున్నారు.

అనంతరామయ్యగారు శాంతిని చాల గారాబంగా పెంచారు. 'నాన్నా! కాలేజీకి వెళ్ళడానికి ఫియట్ బాగా లే'దంటే, 'ఫియట్ అమ్మ షాపింగ్‌కి వెళ్ళడానికిచ్చేసి నువ్వు ప్లిమత్ వాడుకోమ్మా' అనేవారు. ప్రతీ నెలా చీరల మార్కెట్టు సగం యింట్లో ఉండేది. రవికాంత్ బి. యే. ప్యాసయిన యేడాది శాంతి పి. యు. సి. ప్యాసయింది. రవికాంత్ ఉద్యోగం చేస్తానంటే అనంతరామయ్యగారు పట్టుబట్టి 'లా'లో జేర్పించారు.

రవికాంత్ కాన్వొకేషన్‌లో 'రమణయ్య మెమోరియల్ మెడల్ ఫర్ లా' అందుకుంటుంటే చూచిన అనంతరామయ్య కళ్ళు చెమర్చాయి.

'శాంతీ...' మేడమెట్లు ఎక్కుతూ వెనక్కు తిరిగింది.

'నీతో మాట్లాడాలి! రేపు బీచికి వస్తావా'. రవికాంత్ అడిగా డనేకంటే అర్థించాడంటే బాగుంటుంది.

'అలాగేలే' హైహీల్సు టక టక చప్పుడు చేస్తూ మేడమీదికి వెళ్ళిపోయింది.

అరనిముషం హాయి లేని మానవ హృదయంలా ఎగిరి పడుతోంది సముద్రం. జనం జంటలు జంటలుగా బీచికి చేరుకుంటున్నారు.

'శాంతీ...' ఆవేశంగా అన్నాడు రవికాంత్.

'ఏమిటో చెబుతా నన్నావుగా... తొందరగా చెప్పు.'

'నీ పెళ్ళి గురించి నీ ఆలోచన ఏమిటి శాంతీ?'

శాంతి నవ్వి'ఏముంది తొందరగా పెళ్ళి చేసుకోవడమే.'

'పోనీ! నా గురించి నీ ఆలోచన ఏమిటి!'

అకస్మాత్తుగా 'అదేమిటి రవికాంత్! అసలా ప్రశ్న ఎలాగ అడిగావు. నీకేముందని నన్ను చేసుకో మంటావు' అంది.

'అదేమిటి శాంతీ! ఏమున్నా లేక పోయినా నా భార్యని పువ్వుల్లో పెట్టి పూజించే మనసుంది.'

'అవి కవిత్వాల్లో మాటలు కాంత్! నీకు బ్యాంక్ బ్యాలన్స్, బొచ్చు కుక్కా, బ్యూక్ కారు—యీ అర్హత లున్న నాడు నా మాట తలపెట్టు' కరకుగా అంది శాంతి.

'జీవితంలో బ్యాంక్ బాలన్స్, బొచ్చుకుక్కా, బ్యూక్ కారూ—ఇవన్నీ మనసిచ్చే మనిషికన్నా గొప్పవా శాంతీ?'

'నాకు గొప్పవే' అంటూ విసవిసా నడచి వెళ్ళిపోయింది.

ఆ తరువాత రవికాంత్‌కి మరో లాయరుగా రమ్మాయి శ్యామలతో వివాహమైంది. తను కోరుకున్న బ్యూక్ కారు, బొచ్చుకుక్కా ఉన్న రాజశేఖర్‌తో తన వివాహమైంది.

'బ్యూక్ కారు' హారన్‌తో ఉలిక్కి పడింది శాంతి. లేచివెళ్ళి తలుపు తీసింది.

'నేను తాగలేదు...నాకు నిషాలేదు' ఏదో సినిమాలో పాట పాడుతున్నాడు శేఖరం.

'ఏయ్! ఏమిటా వెధవ ముఖం... ఏడుస్తూ తలుపు తియ్యొద్దని ఎన్ని సార్లు చెప్పాను' అంటూ చెయ్యి విసిరి మేడమీదకు వెళ్ళిపోయాడు.

శాంతి గులాబీ చెంపమీద అయిదు వేళ్ళు ముద్రింప బడ్డాయి.

బొచ్చుకుక్క బొయ్‌మంది.

★★★

---

★ "న్యూయార్కులో ప్రతి అర గంటకి ఒక మనిషి కార్లకింద పడుతూ వుంటాట్ట."

"పాపం. ఎవడో ఆ నిర్భాగ్యుడు?"

★ సెన్సార్ అధికారి ప్రొడ్యూసర్‌తో: "మీ కొత్త సినిమా విజ్ఞానదాయకంగా వుంటుం దన్నారు. ఏమిటా విజ్ఞానం?"

ప్రొడ్యూసర్: "అనాటమీ"